క్లుప్తంగా

ఘనంగా లహూజీ సాల్వే జయంతి



నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

నార్నూర్: బడుగు, బలహీన వర్గాల ఆరాధ్యుడు లహూజీ సాల్వే 228వ జయంతిని మండలంలోని ఖంపూర్ గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రామస్తులు పూలమాల వేసి నివాళులర్పించారు. సామాజిక కార్యకర్త చౌహాన్ శ్రీనివాస్, దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిన్వట్ ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే భీంరావును సన్మానిస్తున్న నాయకులు

బోథ్: సొనాల గ్రామానికి వచ్చిన మహారాష్ట్రలోని కిన్వట్ ఎమ్మెల్యే కేరం భీంరావ్‌ను ఆదివాసీ నాయకులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఐటీడీఏ డైరెక్టర్ మేస్రం భూమన్న, నైతం దేవ్‌రావ్, భీంరావ్, జకేస్, సీతారాం, మాణిక్‌రావు ఉన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు సరికాదు'



మాట్లాడుతున్న ప్రభావతి

ఎదులాపురం: కాంగ్రెస్ మాజీ నాయకురాలు గండ్రత్ సుజాతపై కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు సరికాదని మున్నూరు కాపు సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రభావతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్నూరు కాపు మహిళను వ్యక్తిగతంగా దూషించడాన్ని మండిపడ్డారు. మహిళలను కించపర్చేలా మాట్లాడితే రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సుజాతకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆగని బెల్ట్‌దందా

- ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా బెల్ట్‌షాపుల నిర్వహణ
- గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు



పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లతో సీఐ, ఎస్సై (ఫైల్)

నేరడిగొండ: ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వహణ నిలిపివేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పోలీసులు గతంలో బెల్ట్ దుకాణాలు నిర్వహించే వారిని పోలీస్‌స్టేషన్లకు పిలిపించి వారికి పరిస్థితిని వివరించడంతోపాటు నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా జిల్లాలోని పలు గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పోలీసులు అడపాదడపా దాడులు చేస్తూ అనంతరం పట్టించుకోకపోవడంతో వారంతా తమ పని కానిచ్చేస్తున్నారు. గ్రామాల్లో రహస్య ప్రదేశాల్లో మద్యాన్ని నిల్వ చేసి మందుబాబులు వచ్చినప్పుడు తెచ్చి ఇస్తున్నారు. దీంతో యువకులు, పార్టీల కార్యకర్తలు వాదోపవాదాలు చేసుకోవడం పరిపాటిగా మారింది. ఇదే తరుణంలో ఆవేశాలకు లోనై ఘర్షణలు జరిగే ప్రమాదముంది. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు దాడులు చేసిన దాఖలాలు లేవు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల్లో మద్యం పంపిణీ చేసేందుకు బెల్ట్ దుకాణదారులతో వారం క్రితమే భారీగా కొనుగోలు చేయించి రహస్య ప్రదేశాల్లో భద్రపర్చినట్లు సమాచారం. ఆయా మండలాల్లోని గ్రామాలకు చెందిన మద్యం దుకాణదారులు భారీగా మద్యం కొనుగోలు చేసి దాచిపెట్టినట్లు తెలిసింది. ఇప్పటికైనా కోడ్ గట్టిగా పనిచేస్తుందో..లేదో చూడాలి.

ఎవరైన అమ్మితే కఠిన చర్యలు

గ్రామాల్లో ఎవరైన బెల్టుషాపులు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఎవరైన మద్యం విక్రయిస్తే సమాచారం అందించాలి.– రాజమౌళి, ఎక్సైజ్ సీఐ, ఇచ్చోడ

కాంగ్రెస్, బీజేపీకి ఓటేసి వృథా చేయొద్దు

- ఎమ్మెల్యే జోగు రామన్న

బేల: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలు ఓటేసి వృథా చేయొద్దని ఎమ్మెల్యే జోగు రామన్న కోరారు. మండలంలోని సదల్‌పూర్, వరూర్, హస్నాపూర్, పోహార్, మశాల(కె), దుబ్బగూడ(ఎం), హేటి, టాక్లీ, షంషాబాద్, కాప్సి(బి) గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దండారీ ఉత్సవాల్లో పాల్గొని నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, జెడ్పీటీసీ అక్షిత సతీశ్‌పవార్, నాయకులు ఠాక్రే గంభీర్, జక్కుల మధుకర్, బండి సుదర్శన్, తన్వీర్‌ఖాన్, గోవింద్‌రావు, కొడే విపిన్ పాల్గొన్నారు.



దండారీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే జోగు రామన్న

పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: పట్టణ ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే జోగు రామన్నకు ప్రజల సంపూర్ణ మద్దతు ఉందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని 46వ వార్డు పరిధిలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలు, బీఆర్ఎస్ మేనిఫెస్టో వివరించారు. అభివృద్ధి జరగలేదంటూ ప్రతిపక్షాలు విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ప్రతి వార్డులో రోడ్లు, డ్రెయినేజీ వసతులు కల్పించామన్నారు. కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బాదన్ గంగన్న, శివకుమార్, కస్తాల ప్రేమల, ప్రకాశ్ పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా ప్రింటింగ్ మిషన్‌పై పనిచేస్తున్న ప్రేమేందర్

ఘనంగా జాతీయ సహకార వారోత్సవాలు

గుడిహత్నూర్/ఇంద్రవెల్లి/తలమడుగు: 70వ జాతీయ సహకార వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుడిహత్నూర్‌లోని పీఏసీఎస్ కార్యాలయంలో సంఘ జెండాను సీఈవో కేంద్రే పండరీ ఎగురవేశారు. ఇంద్రవెల్లిలోని ఏడీసీసీ బ్యాంక్, పీఏసీఎస్ కార్యాలయాల్లో ఏడు రంగుల జెండాలను ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ మెస్రం కోసేరావ్ ఆవిష్కరించారు. పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్,ఏడీసీసీ బ్యాంక్ ఫీల్డ్ అఫిసర్ రంగనాథ్ ఉన్నారు. తలమడుగు పీఏసీఎస్ కార్యాలయంలో సీఈవో మోతే శ్రీనివాస్ జెండాను ఎగరవేశారు. కార్యదర్శి సాగర్, గంగయ్య, భీమ్రావు, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



తలమడుగులో జెండా ఆవిష్కరిస్తున్న సీఈవో మోతే శ్రీనివాస్

సస్యరక్షణ చేపట్టాలి

బేల: ప్రస్తుతం శనగ పంటలో ఎండుతెగల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ శాస్త్రవేత్తలు రాజశేఖర్, మోహన్‌దాస్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సిర్సన్న, అవాల్‌పూర్ రెవెన్యూ గ్రామాల శివారులోని పత్తి, కంది, శనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తిలో గులాబీ పురుగు లేకున్నప్పటికీ, రానున్న కాలంలో వచ్చే అవకాశం ఉందని, నివారణ చర్యలపై దృష్టి సారించాలని సూచించారు. కందిలో కీటకాల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వారివెంట వ్యవసాయ విస్తరణ అధికారులు రమణ, రాజు ఉన్నారు.



శనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సంక్షిప్తంగా

కిసాన్‌సెల్ పదవికి రాజీనామా

కైలాస్‌నగర్: కాంగ్రెస్ అనుబంధ కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కొండ గంగాధర్ మంగళవారం ప్రకటించారు. గత కొన్నేళ్లుగా పార్టీని తన భుజాన వేసుకొని పనిచేస్తున్న గండ్రత్ సుజాతపై ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'గిట్టుబాటు ధర లేక ఆందోళనలో రైతులు'

ఆదిలాబాద్‌రూరల్: ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారని ఆదివాసీ నాయకుడు, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌రావ్ అన్నారు. మండలంలోని పిప్పల్‌ధరి పంచాయతీలో గల దహిగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో మద్దతు ధరకు మించి పత్తి రేటు ఉండేదన్నారు. అధికార పార్టీ నేతలు, దళారులు కలిసి సిండికేట్ అయి పత్తి రైతులను నష్టం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పత్తి ధర పెరగకుండా కుట్ర చేస్తున్నాయని విమర్శించారు.

అనారోగ్యంతో లేగదూడ మృతి

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామంలో లేగదూడ మంగళవారం అనారోగ్యంతో మృతిచెందింది. లేగదూడకు వైద్యం అందించాలని పశువైద్య సిబ్బంది సమాచారం అందించిన సకాలంలో చికిత్స అందించలేదన్నారు. గోపాలమిత్ర ద్వారా వైద్యం అందించడంతో సరైన చికిత్స అందక మృతి చెందిందని బాధిత రైతు గొంటిముక్కుల రవీందర్ తెలిపాడు.

'సఖీ' సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జైనథ్: సఖీ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద, సఖీ కేంద్రం సోషల్ కౌన్సిలర్ లావణ్య కోరారు. మండలంలోని జామిని, జున్నపాని, దత్తగూడ గ్రామాల్లో మహిళా చట్టాలు, హక్కుల పై మంగళవారం అవగాహన కల్పించారు.

రేపటి నుంచి పత్తి కొనుగోళ్లు

బేల: మండలకేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో గురువారం ప్రైవేటు పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని జైనథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి కాంబ్లే మధుకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి మంచి మద్దతు ధర పొందాలని సూచించారు.

17న మండల సర్వసభ్య సమావేశం

జైనథ్: స్థానిక రైతువేదిక భవనంలో ఈనెల 17న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గజానన్‌రావ్ తెలిపారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. శాఖల అధికారులు నివేదికలతో రావాలని సూచించారు.

మధుమేహాన్ని నియంత్రించవచ్చు

ఇచ్చోడ: ఆరోగ్యకరమైన అలవాట్లతో మధుమేహ వ్యాధిని నియంత్రించవచ్చని ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యాధికారి సాగర్ అన్నారు. ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ప్రాణంతక వ్యాధిలో మధుమేహ వ్యాధి తొమ్మిదివ స్థానంలో ఉందన్నారు. 1922లో వ్యాధి నియంత్రణకు కావల్సిన ఇన్సులిన్ కనుగొన్న కెనడాకు చెందిన ఫ్రెడారిక్ బాంటింగ్ పుట్టినరోజు సందర్భంగా ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. సీహెచ్‌వో బ్రహ్మానందం రెడ్డి, హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

బోథ్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు.

మోసపోతే గోసపడతాం

- విపక్షాలను నమ్మితే ఆగమే
- బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్



అనిల్ జాదవ్‌కు గజమాల వేస్తున్న గ్రామస్తులు



వికలాంగుడితో మాట్లాడుతున్న అనిల్ జాదవ్



ఇచ్చోడ: బీఆర్ఎస్‌లో చేరిన గుండాల కార్యకర్తలు

నేరడిగొండ: తెలంగాణ ప్రాంతాన్ని దోచుకున్న కాంగ్రెస్ తెలంగాణ ప్రజలపై విషం చిమ్ముతున్న బీజేపీని ప్రజలు నమ్మి గోసపడొద్దని బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్‌లో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు ఆయనకు గజమాలతో స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం గ్రామంలోని పలు ఆలయాలు, దర్గాలను సైతం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం దేశానికి మార్గదర్శకంగా మారిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో పేదలు సంతోషంగా ఉన్నారన్నారు. వారంటీ లేని కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో, ఓటు బ్యాంక్‌లేని బీజేపీ బీసీ సీఎం పేరుతో ప్రజల ముందుకు వస్తున్నాయన్నారు. స్థానిక సర్పంచ్ గాదె సమత, ఎంపీటీసీ అంబేకర్ పండరి, మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, నాయకులు ఉప్పు పోశెట్టి, శేక్ ఫయ్యాజ్, భూషణ్, గాదె శంకర్, సుభాష్ గౌడ్, శ్రీకాంత్, సయ్యద్ లాలు, అస్మతుల్లా, పాల శంకర్, రాములు, నవీన్, అశోక్, రమేశ్, మోహన్, నర్సయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

ఇచ్చోడ: బీఆర్ఎస్ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని మంగళవారం పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన గుండాల కార్యకర్తలకు కండువా కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని చూసే ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. 40 ఏళ్ల నుంచి బోథ్‌లో కాంగ్రెస్ గెలువలేదన్నారు. ఎంపీపీ ప్రీతంరెడ్డి పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలో మంగళవారం జెడ్పీటీసీ సంధ్యారాణి ప్రచారం చేపట్టారు. మండల కన్వీనర్ దామెర్ల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, గ్రంథాలయ డైరెక్టర్ రమణగౌడ్, బీమ బుచ్చన్న, రఫీ, దీటి దేవిదాస్, వాహీద్, రమణ, నర్సయ్య ఉన్నారు.

అహంకారపు ప్రభుత్వాన్ని కూలగొడదాం

- బీజేపీ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావ్



కండువా కప్పుతున్న సోయం బాపూరావ్



కనుగుట్టలో సోయం బాపూరావ్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

బోథ్: అహంకారపు ప్రభుత్వాన్ని కూలగొడదామని బీజేపీ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావ్ అన్నారు. మండలకేంద్రంతోపాటు సొనాల, కౌఠ(బి), కనుగుట్ట, పొచ్చెర, కుచులాపూర్, ధన్నూర్(బి) గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సోయం బాపూరావ్ మాట్లాడుతూ అహంకారపు మాటలు మాట్లాడుతున్న కేసీఆర్, కేటీఆర్‌ను గద్దె దించేందుకు ప్రజలు బీజేపీ పార్టీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీతోనే దేశం సురక్షితంగా ఉందని అన్నారు. రాష్ట్రం సురక్షితంగా ఉండాలంటే బీజేపీ అధికారంలోకి రావల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలోకి రావాలంటే ఓటు కీలకమన్నారు. మీలో ఒకడిగా నేనుంటానని అన్నారు. కార్యక్రమంలో రైల్వేబోర్డు సభ్యులు జి.వి.రమణ, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, నాయకులు సూర్యకాంత్ గిత్తే, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

బోథ్ వైస్ ఎంపీపీ రాథోడ్ లింబాజీ, మాజీ ఎంపీపీ దంపతులు గంగుల లక్ష్మి, గంగుల మల్లేశ్, సొనాల పీఏసీఎస్ డైరెక్టర్ లోలపు పోశెట్టి బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. మంగళవారం బోథ్‌కు వచ్చిన బీజేపీ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్‌లో నాయకులు ఇమడలేకపోతున్నారని సోయం బాపూరావ్ అన్నారు. త్వరలో మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు.

గెలిపిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తా

- ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

కడెం: ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. మండలంలోని కొత్తమద్దిపడగ, ధర్మాజీపేట్, కన్నాపూర్, కొండుకూర్, అంబారిపేట్, పాండ్వపూర్, నవాబ్‌పేట్ తదితర గ్రామాల్లో మంగళవారం జాన్సన్ నాయక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, జీవన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వేణుగోపాల్, ఏఎంసీ డైరెక్టర్ మంగ, సర్పంచ్‌లు శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, నాయకులు స్టీఫెన్, లచ్చన్న తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎర్వచింతల్‌లో ఉపసర్పంచ్ దేవేందర్, వార్డు సభ్యుడు పరమేశ్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి జాన్సన్ నాయక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



విజయ సంకేతం చూపుతున్న జాన్సన్‌నాయక్

ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్ ఖానాపూర్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని పెర్కగూడ, వేణునగర గ్రామాల్లో వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, ప్యాక్స్ చైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాం జాదవ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, నాయకులు మర్సుకోల తిరుపతి, హరినాయక్, జగ్జీవన్ శ్యాం, రవీందర్, హరీవ్, స్వామి, బాబా, శ్యాం, ఆశన్న, మహేందర్, భూమన్న, బల్వంత్, వినోద్ ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె అన్నారు. మండలంలోని సట్వాజీగూడ, బుర్సన్‌పటర్, మర్కగూడ గ్రామాల్లో మంగళవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటేసి ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, ఎంపీటీసీలు కోవా రాజేశ్వర్, మండల కోఆప్షన్ సభ్యులు మీర్జా జీలానిబేగ్, నాయకులు కోరెంగా సుంకట్‌రావ్, డోంగ్రె గణేశ్, పర్సురాం నాయక్, శివాజీ, ధన్‌రాజ్, బాబు వాగ్మారే, కాలే శివాజీ ఉన్నారు.



మర్కగూడలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఉచిత వైద్యశిబిరం

కైలాస్‌నగర్: పట్టణంలోని నిరాశ్రయుల ప్రయోజనార్థం మెప్మా ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. చిల్కూరి లక్ష్మినగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు చేశారు. మెప్మా డీపీఎం శ్రీ నివాస్, టీఎంసీ భాగ్యలక్ష్మి, రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రవి ఉన్నారు.

పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదు సీజ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న డబ్బును వన్‌టౌన్ పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై ఉదయ్ కుమార్ కథనం ప్రకారం.. మంగళవారం సాయంత్రం పట్టణంలోని నేతాజీ చౌక్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. రణదీవెనగర్‌కు చెందిన జవానీ రహీం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అనుమానం వచ్చి పోలీసులు తనిఖీ చేయగా రూ.లక్ష 41వేల 440 నగదు లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు. అలాగే బ్రహ్మణవాడకు చెందిన అనూప్ పాండే అనే వ్యక్తిని సైతం తనిఖీ చేశారు. ఆయన వద్ద రూ.లక్ష 16వేల 761 లభించగా ఆ నగదును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రజకుల అభివృద్ధికి కృషి

బోథ్: రజకుల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని రజక సంఘం సభ్యులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రజకులకు బీసీ బంధు, ఉచిత కరెంట్, దోబీఘాట్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రజకసంఘం మద్దతు బీఆర్ఎస్‌కే ఉందన్నారు. రజక సంఘం అధ్యక్షుడు కందుల గంగారాం, కోశాధికారి బండి నారాయణ, ఉపాధ్యక్షుడు రమేశ్, సభ్యులు లచ్చన్న, రమేశ్, సతీశ్, నరేశ్, అనిల్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

తలమడుగు: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తలమడుగు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వెంకట్‌రావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తలమడుగులోని పాఠశాల విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.